హార్ట్ స్పెషలిస్ట్

వీరభద్రరావు పట్ని

నేను క్యాంప్ నుంచి తిరిగొచ్చి కంపెనీ కెళ్లేసరికి బాగా ఆలస్యమైంది వెళ్లగానే నా అసిస్టెంట్ చెప్పాడు

"శంకరంగారు మీకోసం రెండుసార్లు ఫోన్ చేసారు" అని

వెంటనే నేనాయనకు రింగ్ చేసాను

"మై బోయ్! నీతో అర్జంటుగా మాట్లాడాలి — నీ రూం కొస్తున్నాను" అన్నారు

"ఒద్దులెండి సార్! నేనే మీ దగ్గర కొస్తాను మీ ఫ్లాస్కులో బోర్నవిటా తాగి చాలా కాలమైంది" అన్నాను నవ్వుతూ

"ఒ కే వెల్‌కం" అన్నారాయన

శంకరంగారు నాలాగే మా కంపెనీలో మరో ఆఫీసర్ వయస్సులో మాత్రం నాకంటె బాగా పెద్దవాడు అసిస్టెంట్‌గా జీవితం ప్రారంభించి ఎన్నో కంపెనీల్లో పన్జేసి ఇప్పటికి ఆఫీసరయ్యారాయన నాలాటి డైరెక్ట్ రిక్రూట్సంటే వాళ్ళకు అసూయతో కూడిన దురభిప్రాయం వుంటుంది మేము తొందరపడి నిర్ణయాలు తీసుకుంటామని అన్నీ యీజీగా తీసుకుంటామని, ఒళ్ళొంచి పన్జేయమని వాళ్ళ నమ్మిక అలాగే ప్రమోటెడ్ వాళ్ళంటే "ఛాందసులని" మా వాళ్ళ ఆలోచన కాని శంకరంగారలాటి మనిషి కాదు

నేను ఢిల్లీనుంచి ట్రాన్స్‌ఫరై వచ్చిన మూణ్నెలల్లోనూ నాకు ఆయనతో బాగా స్నేహమయ్యింది

నేను వెళ్లి బోర్నవిటా తాగడం పూర్తయ్యాక ఆయనకు మామూలుగానే సిగరెట్ ఆఫర్ చేసాను

కాని ఆయన సమాధానాన్కి నేను ఉలిక్కిపడ్డాను విపరీతంగా సిగరెట్లు తాగే ఆయన ఎందుకంత సడెన్‌గా స్మోకింగ్ మానేసారో నా కర్థం కాలేదు ఆయన్నే అడిగాను

"అది చెప్పడానికే నిన్ను అర్జంటుగా కాంటాక్ట్ చేసాను రెండు రోజుల క్రితం నాకు గుండెనొప్పి వచ్చింది" నేను చాలా ఆదుర్దా పడ్డాను

ఆయన మాత్రం చాలా ధైర్యంగా కనిపించారు

"ఏమీ కంగారు పడక్కర్లేదు డాక్టర్‌ని కలిశాను ఏవో మందులు రాసిచ్చాడు ఎందుకేనా మంచిది ఓసారి స్పెషలిస్ట్‌ని కలవమన్నాడు ఉస్మానియాలో ఒకామె వుందట ఆమెకు లెటర్ రాసిచ్చాడు ఈవేళ సాయంత్రం వెడదామనుకుంటున్నాను నువ్వుకూడా వస్తే ధైర్యంగా వుంటుంది" అన్నారు

ఆయనంత ధైర్యంగా చెప్తున్నా — నా ఆందోళన మాత్రం తగ్గలేదు

"సాయంత్రం ఎందుకూ? ఇప్పుడే వెడదాం!" అన్నాను

"ఆవిడ సాయంత్రాలు ఇంటిదగ్గరుంటుంది— పంజాగుట్టలో ఆమె యిల్లు అడ్రస్ తీసుకున్నాను"

"ఎవరావిడ ?"

"డాక్టర్ రాధిక "

వెంటనే నాకు మా రాధిక గుర్తొచ్చింది ఒకవేళ డాక్టర్ రాధిక ఇక్కడే వుందేమో ? నేను ఢిల్లీనుంచి హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత ఎప్పటికప్పుడు ఆమె ఎడ్రస్ తెల్సుకుని కలవాలనుకుంటూనే గడిపేశాను ఒకవేళ శంకరంగారు చెప్పే హార్ట్ స్పెషలిస్ట్ ఆవిడే అయితే ? రాధికను కలవబోతున్నందుకు చాలా సంతోషమనిపించింది

* * *

రాధిక నాకు నాలుగేళ్ల క్రితం పరిచయమయ్యింది ఓ రోజు నేను, నారాయణ కల్సి ఉస్మానియా మెడికల్ కాలేజీకి మెడికల్ ఎగ్జిబిషన్ చూడటానికెళ్ళాం చాలాసేపు అక్కడ అన్నీ చూస్తూ తిరిగాం పై అంతస్తులో పెద్ద హాలు వుంది అందులో గుండెకు సంబంధించిన విషయలన్నీ సూచించే ఛార్టులు, మోడల్స్ వగైరా అమర్చారు హార్ట్ కంప్లైంట్ ఎందుకొస్తుందో, ఆ జబ్బుని ఎలా గుర్తించాలో ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరంగా చెపుతోంది రాధిక నాకు రాధిక తీసుకునే శ్రద్ధ, ఓపిక చూస్తే చాలా ముచ్చటేసింది అక్కడే ఎక్కువసేపు నిలబడిపోయాం చివర్న ఆమెకు థాంక్స్ చెప్తూ —

"మీ పేరు తెలుసుకోవచ్చా !" అనడిగాను ఇంగ్లీషులో

"రాధిక " తియ్యగా సమాధానమిచ్చింది

రాధిక అందంగా, సింపుల్‌గా వుంటుంది ఆమె చక్కటి ఇంగ్లీషులో మాట్లాడుతుంది ఎదుటివారి ప్రశ్నలకు సమర్థవంతంగా జవాబులిస్తోంది ఆమె హాయిగా మాట్లాడగలదు అందంగా నవ్వగలదు

తర్వాతెప్పుడు రాధిక నాకు జ్ఞాపకంరాలేదు కొన్నెళ్ల తర్వాత నేను డాక్టర్ నిరంజన్ పెళ్లికెళ్ళాను ఆయన నాకు మంచి స్నేహితుడు అందుకని ముందుగానే నేను ఏర్పాట్లు చూడ్డానికి ఎగ్జిబిషన్ క్లబ్ కెళ్లిపోయాను అక్కడ మళ్లీ నాకు రాధిక కనిపించింది

ఆమెను మాడగానే నేను పోల్చుకున్నాను ఆమె నన్ను గుర్తుపట్టదేమో ననుకున్నాను కాని తనే వచ్చి నన్ను పలకరించింది

పెళ్లికూతురు 'మీరా' ఫైనల్ మెడిసన్ చదువులోంది

రాధిక, మీరా క్లాస్‌మేట్సట

ఆరోజు మేమెంతో హాయిగా కాలక్షేపంచేసాం

అప్పుడే నాకు, రాధికకు స్నేహం పెరిగింది

ఆమె నన్ను వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించింది

ఎప్పటికప్పుడు వాళ్లింటికి వెడదామనుకుంటూనే ఓ నెల గడిపేశాను

ఓ రోజు రాధిక నాకోసం కంపెనీకి ఫోన్ చేసింది

తను నన్ను కలవడాన్కి వస్తూన్నట్టు, ఆఫీసులో వెయిట్‌చెయ్యమని చెప్పింది

ఓ అరగంట తర్వాత రాధిక మరొకతన్ని తీసుకుని నాదగ్గర కొచ్చింది అతను తన స్నేహితుడు కృష్ణగా నాకు పరిచయంచేసింది అతను సిటీలోనే ఓ హైస్కూల్లో బి ఇడి టీచర్‌గా పనిచేస్తున్నాడు

కృష్ణ బాగా సాత్వికుడు, నెమ్మదస్తుడు మర్యాదస్థుడుగా నాక్కనిపించాడు అతను తక్కువ మాట్లాడతాడు

ముగ్గురం 'కామత్' హోటల్లో కూర్చున్నాం

కాఫీ ఆర్డర్‌చేసాక వాళ్ళొచ్చిన విషయం కృష్ణే చెప్పేడు

హార్ట్ స్పెషలిస్ట్

"రేపు రాధిక పుట్టినరోజు కొద్దిమంది స్నేహితుల్ని పిల్చి మా యింట్లో పార్టీ ఇస్తున్నాను మీరు తప్పక రావాలి"

మర్నాడు పార్టీ కెళ్ళాను రాధికకు మంచి పెన్ బహూకరించాను నేను పార్టీ కెళ్ళినందుకు యిద్దరూ ఎంతో సంతోషించారు నేనుకాకుండా వ రో పాతికమందిదాకా పార్టీకొచ్చారు అందులో మెడిసన్ చదివేవాళ్ళు ఎక్కువమంది వున్నారు వాళ్ళంతా ఏదో వాళ్ళ కాలేజీ గొడవలు మాట్లాడు కుంటున్నారు ఏర్పాట్ల హడావుడిలో వున్న కృష్ణ రాధికను పిల్చి నాకు కంపెనీ యిమ్మని చెప్పాడు

రాధిక ఎన్నో కబుర్లు చెప్పింది

ఆమెకు చిన్నతనంలోనే తండ్రి పోయాడు చాలా కష్టాలుపడి తల్లి ఆమెను చదివించింది రాధిక మొదట్నుంచీ చదువులో శ్రద్ధ చూపించింది ఆమెకు ప్రతి సంవత్సరం మెరిట్ స్కాలర్‌షిప్పు లొచ్చేవి రాధిక ఎలాగైనా డాక్టరు కావాలని ఎన్నో కలలుకంది అందుకు తల్లికూడా ఒప్పుకుంది

వాళ్ళూళ్ళో వున్న యిల్లొకటి అమ్మేసి వాళ్ళు హైదరాబాద్ వచ్చేసారు ఆమెకు సీటంటూ వచ్చిందికాని, ఆర్థికంగా తట్టుకోలేకపోయింది ఆమెది డబ్బుతో ముడిపడ్డ చదువు అసలే వాళ్ళ ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రం

ఆమె రెండో సంవత్సరం చదువుతుండగా కృష్ణ ఆమెకు పరిచయం అయ్యాడు వాళ్ళ పరిచయం స్నేహంగా మారింది అతనిలోని మంచితనం, నిర్మలత్వం ఆమెను ఆకర్షించాయి ఆమెలోని ఉత్సాహం, పట్టుదల అతనికి నచ్చాయ్ వాళ్ళిద్దరూ మంచి స్నేహితులయ్యారు రాధికకు కావల్సినప్పుడల్లా అడగకుండానే కృష్ణ ఆర్థికంగా సహాయపడుతుండేవాడు అతనికి పెద్దగా బాధ్యత లేమీ లేవు తన సంపాదనలోనే పొదుపుచేసి ఆమెను ఆదుకుంటూండేవాడు ఇంకా చాలక సైకిల్‌మీద తిరిగి ట్యూషన్ చెప్తూండేవాడు

ప్రస్తుతం ఆమె మంచి చెడ్డలు, అవసరాలు అతనే చూస్తూంటాడు ఆమెక్కావల్సిన మనో ధైర్యాన్ని, ఉత్సాహాన్ని అందిస్తూంటాడు

ఇవన్నీ చెప్పాక రాధిక అంది

"మా ఇద్దరికీ ఏదో పూర్వ జన్మానుబంధం వుందనిపిస్తుంది విజయ్ నే నెప్పుడేనా అతన్ని అడగడానికి మొహమాట పడితే నా అవసరాలు ఏమిటో గ్రహించుకుని తనే సాయం చేస్తాడు ఇంత చేస్తున్నాడు కదా — అతను నానుంచి ఏమాశిస్తున్నాడా — అని ఆలోచిస్తే ఏమీ కనబడదు అదే ఎప్పుడేనా అతన్నడిగితే—"నువ్వంటే న కిష్టం రాధీ" అని మాత్రం అంటాడు అతనే కనక నన్ను ఆదుకోకపోయినట్టయితే నా చదువేనాడో ఆగిపోయేది అంతేకాక నా జీవితం దారి తెలియని పడవలాగ అయ్యేది —

ఇంతకీ అసలు విషయం మీకు చెప్పనేలేదు నాకు అతను చేసిన సహాయానికి కృతజ్ఞతగా మనస్సు అతనికి అర్పించాను మే మిద్దరం పెళ్ళి చేసుకోబోతున్నాం" ఆ మాటలు చెప్పేటప్పుడు మాత్రం ఆమె ముఖం సిగ్గుతో ముడుచుకుపోయింది

మళ్ళీ తనే చెప్పడం మొదలెట్టింది

"నేనేం చేసినా అతని ఋణం తీరదు విజయ్‌గారూ! అతనికి జీవితంలో కష్టమంటే ఏమిటో తెలియకుండా చూసుకుంటాను అతని జీవితానికి పూలపాన్పు వేసి సుఖపెడతాను ఈ మాట కృష్ణతో అంటే ఏమన్నాడో తెలుసా!

'రాధీ! నువ్వేమో డాక్టర్ కాబోతున్నావ్ నేనా మామూలు టీచర్‌ని నువ్విలాటి నిర్ణయం తీసుకునేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించు కోవడం మంచిది'

అతనలా అన్నాక అతనిమీద గౌరవం పెరిగిందండీ! నా చదువు పూర్తి కాగనే మేమిద్దరం పెళ్ళి చేసుకుంటాం" ఎంతో ఆనందపడిపోతూ ఈ విషయాలన్నీ చెప్పింది

ఆమె ఉరుకులు పరుగులతో వేసే జలపాత మైతే అతను నిర్మలంగా, స్వచ్ఛంగా పారే నది లాంటివాడు విభిన్నమైన స్వభావాలు కలవారు ఇద్దరూ అయినా నిర్మలమైన మనస్సుంది ఇద్దరికీ అంతకన్నా ఏం కావాలి దంపతులుగా వాళ్ళు సుఖ పడటానికి? రాధిక ఈ విషయాలన్నీ చెప్పాక కృష్ణంటే గౌరవం అభిమానం పెరిగాయి నాకు

కృష్ణ, రాధికలతో నాకు స్నేహం బాగా పెరిగింది ఎక్కువగా కల్సుకుంటూండేవాళ్ళం శెలవురోజుల్లో సినిమాలకు, షికార్లకు, పిక్‌నిక్‌లకు తిరుగుతుండేవాళ్ళం ఒకరికొకరు పార్టీలు, డిన్నర్లు యిచ్చుకుంటూండేవాళ్ళం

ఇలా ఓ ఆర్నెల్లపాటు గడిచిపోయింది ఇంతలో నాకు ప్రమోషన్‌మీద ఢిల్లీ ట్రాన్స్‌ఫరైంది నేను ఢిల్లీ వెళ్ళిన మొదట్లో కృష్ణ, రాధిక నాకు తరచు ఉత్తరాలు రాస్తూండేవాళ్ళు నేను జవాబు రాస్తూండేవాడ్ని తర్వాత మెల్లి మెల్లిగా యీమధ్య వుత్తర ప్రత్యుత్తరాలు ఆగి పోయాయి వాళ్ళిద్దరూ ఎలావున్నారో తెలియలేదు నాకు ఎప్పుడేనా గుర్తువస్తే వాళ్ళిద్దర్ని తల్చు కుంటూండేవాణ్ని

ఓసారి మాత్రం ఓ మిత్రుడు ఢిల్లీలో కనిపించి రాధిక ఎం డి చేస్తున్నట్టు చెప్పాడు

* * *

సాయంత్రం ఆరుగంటలైంది పట్టణాన్ని చీకటి ముసురుకుంటోంది రోడ్లన్నీ జనసమ్మర్దంతో గర్వపడిపోతున్నాయ్ ఇళ్ళ కెళ్ళిపోవాలనే ఆత్రంతో జనం బస్సుల్లో వేళ్ళాడుతూ మరీ పోతున్నారు పైకి కనబడని గాభరాను తనలోనే దాచుకుని శంకరంగారు ఆటోలో నా ప్రక్కనే కూర్చున్నారు నా మనస్సులో మాత్రం రాధిక, కృష్ణ మెదుల్తున్నారు వాళ్ళిద్దరూ నన్ను చూసి ఆశ్చర్యపడతారు అంతకు మించి ఆనందపడతారు

ఆటో పంజాగుట్టలో ఓ ఆకుపచ్చ రంగుగల పెన్ను మేడ ముందాగింది గేటు పక్కగా గోడమీద 'రాధికా విలాస్' అని పాలరాతిమీద రాసివుంది గోడ మీద పెకాల మరో పెద్ద బోర్డు వుంది అక్కడ పెద్ద పెద్ద అక్షరాలతో

డాక్టర్ విశ్వనాథ్ ఎమ్ డి

డాక్టర్ రాదిక ఎమ్ డి అని వుంది

ఆ బోర్డు చూసి నేను కాస్త ఆశ్చర్య పోయాను అంతలోనే మరో ఆలోచన వచ్చింది ఒకవేళ రాధిక డాక్టర్ విశ్వనాథ్ అనే ఆయనతో కలిసి ప్రాక్టీస్ చేస్తోందేమో? అంతలోనే మళ్ళీ నాకు సందేహం వచ్చింది ఒకవేళ ఆ రాధిక, ఈవిడ ఒకటి కాదేమోనని

శ్రీ కాళేశ్వర క్షేత్రోద్ధరణ: ఒక విజ్ఞప్తి

శ్రీ కాళేశ్వర క్షేత్రోద్ధరణకోసం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంవారు చేపట్టిన కార్యక్రమాలలో జీర్ణోద్ధరణ నిధి సేకరణ ఒకటి కొంత కాలం కింద 'ఆంధ్రపత్రిక' శ్రీశైల క్షేత్ర జీర్ణోద్ధరణ నిధి సేకరణలో పాలుగొని కొంత మొత్తం వసూలుచేసి ఆ నిధిని సమర్పించిన సంగతి పాఠకులకి తెలుసు అదే విధంగా శ్రీ కాళేశ్వర క్షేత్రోద్ధరణ నిధి సేకరణలో కూడా 'ఆంధ్రపత్రిక' పాలు గొనాలని ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళ రావుగారు సూచించారు వారి సూచన ప్రకారం శ్రీ కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ నిధి కోసం చందాలు వసూలు చెయ్యటానికి 'ఆంధ్రపత్రిక' పూనుకొంటున్నది దాతలు తమ విరాళాలను ఈ క్రింద సూచించిన చిరునామాలకి శ్రీ కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ నిధి పేర పంప ప్రార్థన పది రూపాయలకి మించిన విరాళాలు పంపిన దాతల పేరు 'ఆంధ్రపత్రిక' దినపత్రికలో ప్రచురింపబడుతాయి అంతేగాక వారికి రసీదులు పంపబడుతాయి భక్తులందరూ యీ పవిత్ర కార్యక్రమంలో పాలుగొని దాన్ని జయప్రదం చెయ్యగలరని నమ్ముచున్నాము

విరాళాలు ఈ క్రింద ఇచ్చిన చిరునామాలలో దేనికైనా అందచేయవచ్చు

శ్రీ కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ నిధి,
కేరాఫ్ ఆంధ్రపత్రిక
బషీర్‌బాగ్, హైద్రాబాద్-500029

లేక

శ్రీ కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ నిధి,
కేరాఫ్ ఆంధ్రపత్రిక గాంధీనగర్
విజయవాడ — 520003

లేక

శ్రీ కాళేశ్వర క్షేత్ర జీర్ణోద్ధరణ నిధి,
కేరాఫ్ ఆంధ్రపత్రిక
72 తంబుచెట్టి వీధి,
మదరాసు - 600001

సంపాదకుడు,
ఆంధ్రపత్రిక

గేటు తీసుకుని లోపలికెళ్ళాం మేడముందు విశాలమైన స్థలం వుంది

మధ్యగా లాన్స్‌లో నాలుగు సిమెంటు బెంచీ లున్నాయి లాన్స్ మధ్యలో ఓ మెర్క్యురీదీపం అందంగా వెలుగుతోంది చుట్టూ చాలా రకాల పూలమొక్కలున్నాయి గేటు దగ్గర్నుంచి మేడ దగ్గరికి పోవడానికి నాపరాళ్ళ చపటా వుంది మేడకు ముందుభాగంలో ఓ పెద్ద హాలు వుంది అక్కడున్న బెంచీలనిండా జనం వున్నారు మేమక్కడకు వెళ్ళాక ఒకతను వచ్చి డాక్టర్‌గార్ని చూడటానికి మరో అరగంట పడుతుందని వెయిట్ చెయ్యమని చెప్పాడు అతను అక్కడ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు మెల్లగా అతన్ని మాటల్లో దించాను అతని మాటల్నిబట్టి డాక్టర్ విశ్వనాధ్, డాక్టర్ రాధిక దంపతులేనని తెల్సింది

మరైతే ఆమె — ఈమె ఒకరు కారా ?

లేక రాధిక కృష్ణను పెళ్లి చేసుకోలేదా ?

కాస్సేపట్లో డాక్టర్ రాధికను చూస్తాను కదా — అన్ని విషయాలు తెలుస్తాయి అనుకుంటున్నానే కాని — ఆలోచించకుండా వుండలేకపోయాను

నేను, శంకరంగారు కన్సల్టింగ్ రూంలో కెళ్ళాం

కుర్చీలో కూర్చున్న డాక్టర్ రాధిక వెంటనే నన్ను గుర్తుపట్టింది

"హల్లో విజయ్ ! ఎప్పుడొచ్చారు ? ఏమిటి విశేషాలు ?" ముఖమంతా నవ్వు నింపుకుని అడిగింది

రాధిక కాస్త వళ్ళొచ్చినట్టు కనిపిస్తోంది కళ్లజోడు పెట్టుకోడంవల్ల మనిషిలో కొద్దిగా మార్పు కనిపిస్తోంది

"నేను హైద్రాబాద్ వచ్చి మూడు నెలలయ్యింది " అన్నాను

"వ్వాట్ ! మూడు నెలలుగా హైద్రాబాద్‌లో వుంటూ నన్ను చూడటానికి రాలేదా ! రియల్లీ పిటీఫుల్ " అంది నొచ్చుకుంటూ

నేనామెను ఏ కారణాలవల్ల కలవలేకపోయానో వివరించి చెప్పాను కాస్సేపు యిద్దరం కబుర్లు చెప్పుకున్నాం నేను తిరిగి హైద్రాబాద్ ట్రాన్స్‌ఫరై వచ్చినందుకు చాలా ఆనందించింది రాధిక

నేను శంకరంగార్ని ఆమెకు పరిచయంచేసి వచ్చిన పని చెప్పానామెకు

శంకరంగార్ని పరీక్షచేసి — ఏమీ ఆందోళన పడనక్కరలేదని, నీరసంమీద వచ్చిన నొప్పి యని చెప్పింది వారంరోజులు పోయాక మళ్లీ రమ్మనమని చెప్పింది

ఏవో మందులు రాసిచ్చి, విశ్రాంతి తీసుకోమని చెప్పింది

నేనామెతో మాట్లాడుతున్నానన్నమాటేకాని— మనస్సంతా కృష్ణమీదే వుంది

కృష్ణ గురించి ఆమెను అడిగితే ?

అది సమయం కాదనిపించింది

వెడతామని చెప్పి లేచాం

"అన్నట్టు విజయ్ గారూ ! రేపోసారి రాకూడదు ఎలాగూ ఆదివారంకదా ఖాళీగానే వుంటాను సరదాగా కాస్సేపు కబుర్లు చెప్పకుందాం " అంది

సరే వస్తానని చెప్పి ఇంటికి వచ్చేసాను

మర్నాడు మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ రాధిక యింటికి వెళ్లాను

మేడమీద కెళ్లేసరికి నన్ను సోఫాలో కూర్చోమని చెప్పి రాధికను పిలవడానికి లోపలి కెళ్లింది ఓ పనిపిల్ల

"మీకోసమే ఎదురుచూస్తున్నాను " అంది ఆదరంగా రాధిక

మేమిద్దరం మాటల్లో పడ్డాం ఓ ప్లేటు నిండా పళ్లముక్కలు, బిస్కెట్లు తెచ్చిపెట్టింది పనిపిల్ల

కాస్సేపు ఢిల్లీ కబుర్లు, తన ప్రాక్టీస్ కబుర్లు చెప్పుకున్నాం కూల్‌డ్రింక్సు తాగాం నాకు పెళ్ళయినట్టు చెప్పాను మా ఆవిడను తీసుకు రాలేదని చాలా బాధపడింది

ఇంతలో చటుక్కున తనే అడిగింది

"మీరు నిన్న కృష్ణ గురించి అడుగుదామనుకున్నారు కదూ !" అని !

ఆ ప్రశ్న నేను ఊహించలేదు కాని యెలా మొదలుపెట్టాలా అని మాత్రమే అనుకున్నాను

"అడుగుదామనుకున్నమాట వాస్తవమే కాని అది సమయం కాదనిపించి ఊరుకున్నాను ఇంతకీ అసలేం జరిగింది ? ఆయనెక్కడున్నారు " ఎటో చూస్తూ అడిగాను

త్వరలో

"కనువిప్పు"

చిన్న సీరియల్

ఆమె ఏం చెప్తుందో వినడానికి కుతూహలపడ్డా, ఏం చెప్పినా వినడానికి సిద్ధపడ్డాను

"నేను ఎం బి బి ఎస్ క్లాసులో ప్యాసయ్యాను స్కాలర్‌షిప్పతోసహా ఎం డి సీటొచ్చింది ఎన్నాళ్లగానో నాకు హార్ట్ స్పెషలైజ్ చెయ్యాలని వుంది కాబట్టి ఎం డి చేద్దామనిపించింది కృష్ణ సరేనన్నాడు మా పెళ్లి తాత్కాలికంగా వాయిదా వేసుకున్నాం

ఓ సంవత్సరం గడిచేసరికి నా ఆలోచనల్లో నాకే తెలియకుండా ఏదో మార్పు వచ్చింది సంఘం మారుతోంది నేనూ మారుతున్నాను నాగరికత పెరిగింది — నేనూ పెరుగుతున్నాను ఎదుగుతున్న కాలంతోపాటు నేనూ ఎదుగుతున్నాను వీటన్నిటితో పాటు నా ఆలోచన, నా మానసిక స్థితి, నా పరిసరాలు, నాచుట్టూ వుండే మనుష్యులు అన్నీ మారాయి

రాను రాను నేనో విషయం గ్రహించాను

కృష్ణ మాత్రం మొదట్నుంచీ తనెక్కడ వున్నాడో అక్కడే — అదే పాయింట్ దగ్గర వుండి పోతున్నాడు

అలా ఏ విధంగానూ ఎదుగుబొదుగూ లేని మనిషిని, మార్పులేని వ్యక్తిని చేసుకుంటే మేం సుఖపడతామా అన్న ఆలోచన నాకు కల్గింది

నేను డాక్టర్‌గా పెరిగి, హార్ట్ స్పెషలిస్ట్‌గా ఎదిగి ఓ పరిధి దాటి యీవతలి కొచ్చేశాను అతను మాత్రం స్కూలు టీచరుగా అదే పరిధిలో గిరి గీసుకుని వుండిపోయాడు

అప్పటికే నాకు డాక్టర్ విశ్వనాధ్ బాగా తెలుసు ఆయన నా క్లాస్‌మేట్ పైగా ఇద్దరం డాక్టర్లం దంపతులమైతే జీవితంలో ఎంతో సాధించవచ్చునిపించింది

ఉదే నిర్ణయం కృష్ణతో చెప్పాను "నీయిష్టం" అనిమాత్రం అన్నాడు " చెప్పడం ఆపింది

"ఇప్పుడు కృష్ణ ఎక్కడున్నారు ?" కుతూహలంగానే అడిగాను

"విజయవాడలో వుంటున్నాడట కృష్ణ నాకు యెంతో సహాయపడ్డమాట వాస్తవమేకాని యిష్టంలేకుండా అతన్ని చేసుకోవడం ఆత్మవంచన అవుతుందనిపించింది తన ఋణం మరోరకంగా యెలాగైనా తీరుస్తానని తనకేం కావాలన్నా యిస్తానని చెప్పాను అతనేం వద్దన్నాడు "

ఆమె కృతజ్ఞతకు రేటు కటుతోందనిపించి కాస్త కోపం కలిగింది నాకు అయినా నేనేం మాట్లాడలేదు

నేను వెళ్లొస్తానని చెప్పి లేచాను ఎందుకో అక్కడ ఎక్కువసేపు వుండబుద్ధికాలేదు తనూ లేచి నిలబడింది

"అన్నట్టు డాక్టర్ విశ్వనాధ్ ఊళ్లో లేరు మీరు మళ్లీ వచ్చినప్పుడు పరిచయం చేస్తాను చాలా సరదాఅయిన మనిషి యూ విల్ లైక్ హిమ్ " అంది

అల్లాగే అని మాత్రం అనగలిగాను

కూడా గుమ్మందాకా వస్తూ అంది

"నిజం చెప్పండి విజయ్ ! నేను చేసింది తప్పంటారా ?"

ఓ క్షణం ఆలోచించి అన్నాను

"రాధికా ! మీరు డాక్టర్ ఆపరేషన్ చెయ్యడంలో వున్న యింటరెస్ట్ పోస్టుమార్టమ్ చెయ్యడంలో వుండదుకదూ !"

చిరునవ్వు నవ్వి వూరుకుంది

మళ్లీ కలుస్తానని చెప్పి - వచ్చేసాను

మళ్లీ శనివారం వచ్చింది

సాయంత్రం శంకరంగారు నా రూంలో కొచ్చారు

"ఈరోజు డాక్టర్ రమ్మందికదా ! వెడదామా ?" అన్నారు

"సారీసర్ ! నేను రాను మీ వెళ్లిరండి " ఖచ్చితంగా అనేశాను

"అదేం" అనడిగారాయన

"డాక్టర్ రాధిక హార్ట్ స్పెషలైజ్ చేసింది నిజమే ఆమెకు చెడిపోయిన హృదయాలు బాగు చెయ్యడమే తెలుసు నిండుహృదయాల్ని లాలించి పోషించి, పెంచే శక్తి ఆమెకు లేదు ఆమె నిజమైన హార్ట్ స్పెషలిస్ట్ కాదు " అన్నాను

శంకరంగారు ఏమనుకున్నారో తెలియదు

కాని తలొంచుకుని వెళ్లిపోయారు